
# తల్లి మనసు



**భా**ర్య నొప్పులు పడుతుంటే దగ్గరుండి ఆమెను లేడి డాక్టరు వద్దకు తీసుకెళ్ళాడు దినేష్.మమతను పరీక్ష చేసిన వైదేహి వెంటనే ఆమెను హాస్పటల్‌లో ఎడ్మిట్ చేయమంది.

డాక్టరు చెప్పినట్లుగానే ఆరోజు రాత్రి మమత ప్రసవించింది.

సెల్ తీసి అయినవాళ్ళందరికి ఫోన్ చేసాడు దినేష్.

సమాచారం అందుకుని అటు అత్తింటివారు, ఇటు పుట్టింటివారు వచ్చారు. దబ్బపండు లాంటి మగబిడ్డను కన్నందుకు అంతా ఆమెను అబినందించారు.

పసికందును చేతుల్లోకి తీసుకుని ప్రేమగా గుండెలకు హత్తుకుంది మమత.

“తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉన్నారు. ఇంటికి తీసుకెళ్ళవచ్చు” అంది డాక్టర్‌వైదేహి వాడవలసినమందులు రాసిచ్చి.

బంధువులంతా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. వాళ్ళ నోటినుండి ఏమాట ఊడిరావడంలేదు.

అంతలో ఓ మహిళను వెంటేసుకొచ్చాడు దినేష్.

ఆమె వంక విస్మయంగా చూసింది మమత.

“చంటి బిడ్డ ఆలనపాలన చూస్కోడానికి ఆయాను తీసుకొచ్చాను” అన్నాడు దినేష్.

బిడ్డను చూసుకోడానికి మేమంతా ఉండగా ఆయా ఎందుకని ఎవరూ అనలేదు.

వాళ్ళాముక్క ఎందుకనలేదో మమతకు తెలుసు. మౌనంగా రోదించిందామె మనసు. గతం కళ్ళముందు మెదిలింది.

❖ ❖ ❖

మమత, దినేష్ ఐ.టి.రంగంలో ఉద్యోగస్తులు. ఒకే బ్రాంచిలో పనిచేస్తున్నారు. అవసరాలకు మించిన సంపాదన వాళ్ళది. ఆ ఆఫీసులో పనిచేసే ఆడవాళ్ళందరిలోకెల్లా మమతే అందంగా ఉంటుంది. తీరైన ముఖం, ఎర్రని బుగ్గలు, గులాబి మొగ్గలాంటి నాసిక, నల్లని ఒత్తయిన కురులలో దేవకన్యను మరిపిస్తుంది. చిన్నప్పటినుండి ఆమెది భిన్నమైన మనస్తత్వం. తన భావాలను విభేదించిన వారితో అంటీ ముట్టనట్లు వ్యవహరించేది. కన్నవాళ్ళు సయితం ఆమె అంతరంగాన్ని అర్థం చేసుకోలేకపోయేవారు. నిత్యం తనతో సన్నిహితంగా మెలిగే మమత మీద మనసు పారేసుకున్నాడు దినేష్. అతడే మాత్రం ఆమెకు తీసిపోడు. ఏ ఆడపిల్లనైనా ఇట్టే ఆకర్షించగల హ్యాండ్‌సమ్ పర్సనాలిటీ అతగాడిది.

సమయం చూసి మనసులో మాట బయటపెట్టాడు దినేష్.

తన ప్రపోజల్‌కి ఆమె ఔననలేదు కాదనలేదు. ఆమె అంతరంగం అర్థంగాక కొన్నాళ్ళు మౌనంగా ఉండిపోయాడు. మరో సందర్భంలో మళ్ళీ అదే ప్రస్తావన తెచ్చినప్పుడు తనకు కొన్ని స్థిరమైన అభిప్రాయాలున్నాయని వాటిని గౌరవించే వ్యక్తినే చేపట్టాలనుకుంటు న్నట్లు చెప్పింది.

"పెళ్లికి ముందు ఒకరి అభిప్రాయాలు మరొకరు తెలుసుకోవడం మంచిదే కదా!" అన్నాడు దినేష్.

ఆ మాటకు నవ్వి ఊరుకుంది మమత. ముందు ప్లాన్ చేసుకున్న ప్రకారం ఇరువురూ ఇందిరాపార్కుకెళ్ళారు. కాస్త నిర్మానుష్యంగా ఉన్న చోటు ఎంచుకుని చతికిల బడ్డారు.

ప్రస్తావన ఎలా ప్రారంభించాలో తెలీక దిక్కులు చూస్తోంది మమత.

"చెప్పండి మీ అభిప్రాయాలేంటో" అడిగాడు దినేష్ మమత కళ్ళల్లోకి ఆరాధనగా చూస్తూ.

"మహిళలు ఎందులోను మగవారికి తీసిపోరన్నది నా ఉద్దేశం. పురుషులకంటె స్త్రీలు ఓ మెట్టు పైన ఉంటారన్నా ఆశ్చర్యపోవలసిన పనిలేదు. దీనికి మీరేమంటారు" అంది మమత.

"దాంట్లో డౌటేముంది? మీతో సెంట్‌పర్సంట్ ఏకీ భవిస్తున్నాను. స్త్రీపురుషు లిరువురూ నా దృష్టిలో సమానం. మహిళలు చేయలేని పనుల్ని మగవారు చెయ్యగలిగితే, పురుషులు చెయ్యలేనివి స్త్రీలు చేయగలుగుతారు. ఇందులో ఎవరుగొప్పఅన్నదానికి తావుండదు.

"అంటే...' అర్థంకానట్లు చూసింది మమత.

"సహనంతో సంసారాన్ని ముందుకు నెట్టగల శక్తి ఒక్క స్త్రీకే ఉంది. అలాగని ఆడది కేవలం కుటుంబానికే పరిమితమనలేం. దేంట్లోనైనా పురుషులతో ధీటుగా రాణించగలదు.

అయితే శారీరక శ్రమతో కూడిన పనులు మగవారే కాని అబలలు చెయ్యలేరు." వివరణ ఇచ్చాడు దినేష్.

"సారి, ఆడదాన్ని మీరు అబల అంటే నేను సహించలేను. ముందామాట వెనక్కి తీస్కోండి. ఇవాళ మగవారు చేస్తున్న పనులన్నీ ఆడవాళ్లు చేసి చూపిస్తున్నారు. ధైర్యసాహసాల్ని ప్రదర్శించవలసిన పోలీసు డిపార్టుమెంట్లో కూడ స్త్రీలు ఐ.జి, యస్.పి వంటి కీలక పదవుల్ని సయితం చేపట్టి తమ శక్తి సామర్థ్యాల్ని చాటుకుంటున్నారు. పైలెట్లయి ప్లెయిన్లు నడుపుతున్నారు. సర్పంచి నుండి రాష్ట్రపతి వరకు మహిళలు ఎన్నికై తమ సత్తా చూపుతున్నారు. దీని కేమంటారు?" అని అడిగింది.

"కళ్ళముందు కనిపిస్తున్న సత్యాన్ని కాదనడానికి నేనెవర్ని" అన్నాడు దినేష్.

"ఒప్పుకున్నట్లే కదా! ఇక పురుష ఆధిక్యాన్ని నేనే మాత్రం సహించలేను. ప్రతి విషయంలో ఆడ, మగ ఒకరికొకరు సహకరించుకోవాలి."

"అందుకు నేను సిద్ధమే. ఇక మన పెళ్లికి మరే అభ్యంతరం ఉండదనుకుంటాను" నవ్వుతూ అన్నాడు దినేష్.

"ఆ మాట అనగానే సరిపోదు. దానిని నిలబెట్టుకోవాలి లేకపోతే విడిపోవడమొక్కటే మార్గమౌతుంది. అయితే పరిస్థితి అంతవరకు రాకుండా చూసుకోవాలి" హెచ్చరిస్తున్నట్లు అంది మమత.

"తప్పకుండా మీకన్ని విషయాల్లో నేను సహకరిస్తానని ప్రామిస్ చేస్తున్నాను. సరేనా?"

సమాధానంగా పెదిమలపై చిరునవ్వు పులుముకుంది మమత.

ఓ సుముహూర్తాన పెద్దల సమక్షంలో ఇరువురు ఒకటయ్యారు.

భార్య తత్వాన్ని దినేష్ ముందుగానే తల్లికి వెల్లడించడంవల్ల కోడలి మాటకు అడ్డుతగల్లేదు అన్నపూర్ణమ్మ. అర్ధాంగితో సమస్యలు ఎదురుకానందుకు ఊపిరి పీల్చుకు న్నాడు దినేష్.

ఇలా ఉండగా ఓరోజు రాత్రి పడగ్గదిలోకొచ్చిన మమత భర్తను వేరు కాపురం పెట్టమంది. ఉన్నట్లుండి భార్య పేల్చిన బాంబుకి అదిరిపడ్డాడు దినేష్.

"ఇప్పుడేమైంది డియర్? నిన్నెవరైనా ఏమైనా అన్నారా?" అడిగాడు అనునయంగా.

"వివరాలు అడగొద్దు. మీరు వేరు కాపురం పెడుతున్నారా లేదా?"

కట్టుకున్న వ్యక్తి అంత కచ్చితంగా నిర్ణయం తీసుకున్నాక ఇక తను చేయగలిగిందేముంది? అందుకే "నీ ఇష్టం. ఏదైనా మంచి ప్లాటు దొరుకుతుందేమో చూద్దాం" అన్నాడు దినేష్.

మరి మాట్లాడలేదు మమత.

అసలేం జరిగిందో తెలుసుకుందామని ఉదయం లేస్తూనే తల్లిని కలిసి "మమతను నువ్వేమైనా అన్నావా?" అని అడిగాడు.

"ఇంటి ఇల్లాలు మగాడిలా పొద్దెక్కేంతవరకు పడుకోకూడదని హితవు చెప్పానంతే"

అంది అన్నపూర్ణమ్మ.

"అంతేనా? ఇంకేమైనా అన్నావా?" అడిగాడు దినేష్.

"తడిబట్టల్ని నిన్ను ఆరేయమంటుంటె చూడలేక మగడి చేత అటువంటి పనులు చేయించకూడదమ్మా" అన్నాను. ఆ మాటకు సర్రుమని తన గదిలో కెళ్ళిపోయింది.

"దాని స్వభావం ఎటువంటిదో నీకు ముందుగానే చెప్పాను కదమ్మా. ఎందుకు తొందరపడ్డావ్? అన్నిటా ఆడ మగ సమానమన్నది ఆమె సిద్ధాంతం."

కొడుకు మాటలకు బుగ్గనొక్కుకుంటూ "హవ్వ!... ఇదెక్కడి చోద్యంరా... రేపది తల్లైతే నేనో బిడ్డను కన్నాను. మరో బిడ్డను నువ్వుకను అన్నా అంటుందేమో" అంది అన్నపూర్ణమ్మ.

ఆవిడ మాటల్లో వెటకారం ధ్వనించడంతో మరి మాట్లాడలేదు దినేష్. మమత కోరికమేరకు ఇల్లు చూసి ఇల్లాల్ని తీసుకుపోయాడు. తన ఆలన పాలన చూసే భర్త ఏనాడో గతించాడు. ఉన్న కొడుకైనా తనను అంటిపెట్టుకు ఉంటాడనుకుంటే వాడూ దూరమైపోయినందుకు కంట తడిపెట్టింది అన్నపూర్ణమ్మ. రేపు మనవడో మనవరాలో కలిగినా తన చేతుల్తో ఆడించే పరిస్థితి కూడా ఉంటుందో ఉండదోనని తల్లడిల్లిపోయింది. అంతలోనే కొడుకు ఎక్కడో అక్కడ సుఖంగా ఉంటే అంతే చాలనుకుని మనసుని సమాధానపరచుకుంది.

ఆఫీసునుంచి ముందుగా వచ్చిన మమత ఫ్రెష్ అయి టి.వి. ముందు కూర్చుంది.

చీకటి పడ్డాక వచ్చాడు దినేష్. వస్తూనే స్నానంచేసి కిచెన్‌లోకెళ్ళాడు. సింకులో ఎక్కడి గిన్నెలు అక్కడే పడి ఉన్నాయి. అంటే భార్య ఇంకా వంట ప్రయత్నం చెయ్యలేదన్నమాట అనుకుని తిన్నగా మమత వద్ద కెళ్ళి "ఈ పూటకి హోటల్ సాపాటేనా?" అడిగాడు నవ్వుతూ.

"ఇంట్లో సామాన్లన్నీ ఉండగా హోటల్ మెతుకులేం కర్మ" అంది మమత.

"నువ్వింకా వంట జోలికి పోలేదుకదా అందుకని అన్నాను. పరవాలేదు ఆఫీసులో బాగా అలసిపోయినట్లున్నావు. రెస్టుతీస్కో మీల్స్ ప్యాక్ చేయించి పట్టుకొస్తాను."

దినేష్ మాటల్లో సానుబూతి వ్యక్తమౌతోంది.

"వద్దు. నాకు హోటల్ భోజనం సరిపడదు." అసహనంగా పలికింది టి.వి.వాల్యూము తగ్గిస్తూ.

అర్థాంగి అంతరంగాన్ని అర్థంచేసుకున్న దినేష్ మరి కిమ్మనకుండా వెళ్ళి స్టౌవ్ వెలిగించాడు.

మమత వేరు కాపురం పెట్టినప్పటినుండి అయినవాళ్ళెవరూ ఆమె గడపలో కాలుపెట్టలేదు. అయినా ఆమె బాధపడలేదు. ఎంతో నిండుగా జీవించింది. కారు కొనుక్కుంది. నగలు చేయించుకుంది. రోజుకో డ్రస్సులో పెనిమిటితో షికార్లు చేసింది. చూస్తుండగానే సంవత్సరం ఇట్టే తిరిగిపోయింది. అందరిలానే తను గర్భవతి అయింది. తల్లి తోడు దగ్గరుండి చూసుకోవలసిన సమయంలో అన్నీ తానే అయి. ఆమెనెంతో అపురూపంగా చూసుకుంటున్నాడు దినేష్. డెలివరీ టైం రాగానే హాస్పటల్‌లో చేర్పించాడు. తను సుఖంగా

ప్రసవించింది. వండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. విషయం తెలియడంతోనే సంబంధీకులంతా వచ్చారు. వచ్చినవాళ్ళు వచ్చినట్లే తిరుగు ప్రయాణానికి సిద్ధమౌతున్నారు. ఇన్నాళ్ళూ తను ఆకాశం నుంచి ఊడిపడ్డట్టు దర్పాన్ని, అతిశయాన్ని ప్రదర్శిస్తూ ఎవరికి చేరువకాలేకపోయింది. తన సిద్ధాంతాలు తనను ఒంటరిని చెయ్యడం తప్ప ఒరగబెట్టిందేమీ లేదు.

ఏ తల్లి అయినా తన బిడ్డని తనే సాకాలనుకుంటుంది. అనివార్యపరిస్థితుల్లో తప్ప బిడ్డని ఇతరుల చేతుల్లో ఉంచడానికి ఇష్టపడదు. అదే తల్లి మనసు. బిడ్డను చూసుకోడానికి ఎవరినో తీసుకొచ్చాడు భర్త. అనాధలా తన కొడుకు ఆయా చేతుల్లో పెరగడానికి వీల్లేదు. ఇలా ఎన్నో ఎన్నెన్నో ఆలోచనలు మదిలో గిరికీలు కొడుతున్నాయి.

◆ ◆ ◆

అర్ధాంగి నుంచి ఎటువంటి సమాధానం రాకపోయే సరికి "చెప్పు మమతా ఏంచేద్దాం? పసివాడితో నువ్వొక్కర్తివి చేసుకోలేవని ఆయాను తీసుకొచ్చాను." అన్నాడు దినేష్ ఆమె కళ్ళల్లోకి ఆర్తిగా చూస్తూ.

"వద్దండి నాకు ఆయా అవసరం లేదు. నాబిడ్డను నేనే పెంచుతాను" అంది మమత.

"అది సరే, నువ్వు ఆఫీసుకి వెళ్ళినప్పుడు..." సందేహం వ్యక్తం చేసాడు దినేష్.

"లాంగ్ లీవు పెడతాను. వాడికి తల్లి ప్రేమనందిస్తాను. తండ్రిగా మీరు లాలించండి. వాడి నాన్నమ్మ రోజూ వాడికి తలంటి నీళ్లు పోస్తుంది. అత్త వొడిలో హాయిగా నిద్రపోతాడు అంది మమత.

"అంటే నీ ఉద్దేశం" అర్ధాంగి వంక విస్మయంగా చూశాడు.

"మనింటికి వెళ్ళిపోదాం. అంతా కలిసే ఉందాం" అంది ఎంతో ఉద్వేగంగా.

తల్లి అవగానే ఆమెలో వచ్చిన ఈ ఆకస్మిక మార్పుకు అంతా ఎంతగానో సంతోషించారు. అన్నపూర్ణమ్మ సంగతి సరేసరి. కోడలు తీసుకున్న నిర్ణయానికి ఊరంత సంబరపడిపోయింది,. ఇది కలా? నిజమా? అనుకుని చెయ్యి గిచ్చుకున్నాడు దినేష్. కలకాదు నిజమే.

( 27 మార్చి 2011 ఆంధ్రభూమి ఆదివారం అనుబంధం)